పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలి



ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో సేవలందించే వైద్యులకు రక్షణగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. పర్యవేక్షణ కూడా కఠినంగా ఉండాలి. వైద్యులు పనిచేసే ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉండేలా చూడాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సెక్యూరిటీ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అత్యాచారం, హత్య లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకుని వైద్యులకు రక్షణ కల్పించాలి.
-విన్నకోట పవన్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, బంటుమిల్లి



ప్రభుత్వంపై నమ్మకం కలిగించాలి



మా కుమార్తె కిరణ్మయి పశ్చిమగోదావరి జిల్లా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా పనిచేస్తోంది. పేదలకు సేవ చేసే అవకాశం మా అమ్మాయికి దక్కిందనే ఆనందం ఉంది. అయితే ఇటీవల కలకత్తాలో జరిగిన సంఘటనలు చూస్తుంటే వైద్య వృత్తి అంటే భయం వేస్తోంది. చదువు కోసం పిల్లలు దూర ప్రాంతాల్లో ఉంటారు. డాక్టర్లు పనిచేసే చోట ప్రభుత్వం పూర్తి రక్షణ ఏర్పాట్లు చేయాలి. డాక్టర్ల తల్లిదండ్రులకు ప్రభుత్వంపై పూర్తనమ్మకం కలిగించాలి.
-పల్లికొండ వెంకటలక్ష్మి, వైద్యురాలి తల్లి, బంటుమిల్లి

క్లుప్తంగా

ఘనంగా పల్లాలమ్మ జాతర

పెడన: మండల పరిధిలోని లంకలకలువగుంట గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత పల్లాలమ్మ అమ్మవారి జాతర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ కటారి లక్ష్మయ్య, కట్టా రామ్మోహనరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



మోపిదేవి: దొంగతనాలు, సైబర్ నేరాలు, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వైవీవీ సత్యనారాయణ తెలిపారు. గ్రామాల్లో మైక్‌తో ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో అజ్ఞాత వ్యక్తులు, సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మొబైల్‌లలో అజ్ఞాత వ్యక్తులు పంపిన లింక్‌లు ఓపెన్ చేయవద్దని తెలిపారు. కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీరాంబాబు, ఉప సర్పంచ్ బాబూరావు పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో ఆదివారం జరిగిన 45వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సామాజికవేత్త కనిగంటి వెంకటనారాయణ ప్రారంభించారు. మండవ దుర్గాభవానిజ్ఞాపకార్థం కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో జరిపిన శిబిరంలో 102 మందికి కంటి పరీక్షలు చేయగా వీరిలో 85 వృద్ధులను ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. డాక్టర్ యోగేష్, డాక్టర్ జాగృతి నేత్ర పరీక్షలు చేశారు. ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు, జమీల మస్తాన్, మత్తి శివ, తలశిల లీలామనోహర్, షేక్ మస్తాన్ వృద్ధులకు సేవలందించారు.

తామర చెరువు పరిశీలన

పెడన: పట్టణ శివారులోని తామర చెరువును సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు ఆదివారం పరిశీలించారు. పశువులు నీరు తాగేందుకు ఇబ్బందిగా మారడంతో స్థానికులు, పశువుల యాజమానుల కోరిక మేరకు గుర్రపు డెక్క తొలగింపు త్వరితగతిన చేపట్టాలని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ విషయాన్ని కమిషనర్ గోపాలరావుకు పరిస్థితి తెలియజేసి, కాంట్రాక్టరుకు పనిని అప్పగించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సూచించారు. టీడీపీ నాయకుడు గుజరాల్, శానిటేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐ హరికిషోర్ తదితరులు ఉన్నారు.

లింగమ్మ దేవరకు పూజలు

మర్రిపాలెం(నాగాయలంక): గ్రామంలో యన్నంశెట్టి వంశీయుల ఇలవేల్పుగా కొలువై ఉన్న దేవత శ్రీలింగమ్మ దొరసాని జాతర ఉత్సవం ఆదివారం కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా తొలుత యన్నంశెట్టి వెంకటరామారావు (రాము)–పద్మ, యన్నంశెట్టి మురళీకృష్ణ (ట్రయినీ ఎస్‌ఐ)–జాస్మిని దంపతులు దొరసాని అమ్మవారికి సంప్రదాయ బద్ధంగా పసుపు, కుంకుమలు సమర్పించి విశేష పూజ జరిపారు. గుడిలో లింగమ్మ దేవరకు నైవేద్యాలు సమర్పించారు. జాతరలో యన్నంశెట్టి శ్రీలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, సీతారామయ్య, పవన్, మాదివాడ నాగరాజు, బండ్రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. తెల్లవారుజామునుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైనులో బారులు తీరారు. మధ్యాహ్నం 2 గంటల వరకు స్వామివారి దర్శనం కొనసాగింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల, అన్న ప్రసాదం వద్ద భక్తులతో నిండిపోయింది. ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గంగానమ్మ జాతర

గూడూరు: ముక్కొల్లులో ప్రసిద్ధి చెందిన గంగానమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ మాసం మూడో ఆదివారం నిర్వహించే సంబరానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడినవారు గ్రామానికి తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది.

విజయవంతం చేయండి

ఘంటసాల: సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గోటకంలో మండల సీపీఎం కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు స్థానిక శాఖల నుంచి గ్రామ, మండల, రాష్ట్ర స్థాయి శాఖల స్థాయిలో సభలు జరుగుతాయని చెప్పారు. మండల పార్టీ నేతలు గొరుముచ్చు వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, మేడంకి వెంకటేశ్వరరావు, బలే రమేష్, వెనిగళ్ల నాగమణి పాల్గొన్నారు.

పశువుల సంచారంతో పరేషాన్

- రహదారులపై అడుగడుగునా పశువుల గుంపులు
- వాహనదారుల ఇక్కట్లు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- రోడ్లపైనే పాలు పితుకుతున్న యజమానులు
- ఆచరణకు నోచుకోని కలెక్టర్ హామీ



నగరంలో రోడ్డుపై నిలిచిన ఆవుల గుంపు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలోని రహదారులపై పశువుల సంచారం రోజురోజుకు అధికమవుతోంది. నగరానికి మచిలీపట్నం పేరు కంటే పశువులపట్నం పేరు పెడితే బాగుంటుందని సెటైర్లు వస్తున్నాయి. సమస్య తీవ్రత దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. పశువుల యజమానులు వాటి ద్వారా లబ్ధి పొంది వాటిని రోడ్లపైనే వదిలేస్తున్నారు. ప్రధాన రహదారులతోపాటు చిన్నా చితక రహదారులపై ఆవులు, గేదెల సంచారం పెరిగింది. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. పశువులు ఒకదానిపై ఒకటి దాడికి చేసుకుంటున్న సమయంలో రోడ్లపై ప్రయాణించే వారు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్లపై పశువులను దాటుకుని వెళ్లేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో రోడ్లపై చీకట్లో గేదెలు కనపడకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

రోడ్లపైనే పాలు పితుకుతూ..

పశువుల యజమానులు పశువులను రోడ్లపైనే ఉంచి పాలను పితుకుతున్నారు. పాలను సేకరించి పశువులను రోడ్లపై వదిలేసి వెళుతున్నారు. దీంతో పశువులు రోడ్లపైనే తిష్టవేసి వాహనదారులను ఇబ్బందులు పాలు చేస్తున్నాయి. సొంత స్థలాల్లో పశువులకు ఆశ్రయం కల్పించేందుకు యజమానులు ఆసక్తి చూపడం లేదు. పశువుల ద్వారా లబ్ధి పొంది వాటిని రోడ్లపైనే వదిలేస్తున్నారు. రోడ్లపై ఎన్ని ఇబ్బందులు వస్తే మాకేంటి అన్న విధంగా పశు యజమానులు వ్యవహరిస్తున్నారు. దీంతో నగరవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు

ఆదమరిస్తే పశువులకు ఆహారమే..

నగరంలో సంచరిస్తున్న ఆవులు, గేదలు తినుబండారాల దుకాణాలపై దాడులు చేస్తున్నాయి. రోడ్ల వెంట కూరగాయలు, పండ్లు అమ్ముకునే వ్యాపారులు వీటి దాడికి ఇబ్బందులు పడుతున్నారు. పలువురు నగరవాసులు తినుబండారాలను వాహనాలపై ఉంచి ఆదమరిచి ఉంటే వాటిని ఇట్టే పసిగడుతున్న ఆవులు మాటేసి లాక్కెళ్లి తినేస్తున్నాయి. దీంతో చిరు వ్యాపారులు, నగరవాసులు ఉసూరుమంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారులపై ఆవులు, గేదెల సంచారాన్ని నివారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆచరణకు నోచుకోని కలెక్టర్ హామీ..

నగరంలో పశువుల సంచారాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ఇటీవల నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్లో రహదారులపై పశుసంచారం ఒకటని గమనించిన ఆయన పశువుల యజమానులతో సమావేశం నిర్వహించి పశువులు రోడ్లపైకి రాకుండా చూస్తామని తెలిపారు. అయితే ఆ దిశగా అడుగులు పడలేదు. దీనికి కలెక్టర్‌పై రాజకీయ ఒత్తిళ్లే కారణమని చర్చ నగరవాసుల్లో నడుస్తోంది.



కలెక్టరేట్ ముఖద్వారం వద్ద పశువుల తిష్ట

పశువుల యజమానులు రాజకీయ నాయకుల అండదండలతో పైరవీలు చేసి ఈ అంశాన్ని పక్కన పెట్టించినట్లు చర్చించుకుంటున్నారు.

మృతుడి కుటుంబానికి సింహాద్రి పరామర్శ



రామారావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: మండలంలోని ఊటగుండం గ్రామానికి చెందిన కోడూరు పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత దేవనబోయిన రామారావు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. రామారావు పంచాయతీ ప్రజలకు అందించిన సేవలను రమేష్‌బాబు గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు వెన్నా ప్రసాద్, చేబోయిన కృష్ణారావు, తదితరులు పరామర్శించినవారిలో ఉన్నారు.

రూ.34.67 కోట్లతో అభివృద్ధి పనులకు అంచనా

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.34.67 కోట్లతో 997 అభివృద్ధి పనులు చేయనున్నట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన పంచాయతీ–మన సాధికారిత' గ్రామసభల వల్ల పంచాయతీలకు పూర్వవైభవం రానున్నదని చెప్పారు. నియోజకవర్గంలోని 91 గ్రామ పంచాయతీల వద్ద నిర్వహించిన గ్రామసభలు ఆయా గ్రామాల అభివృద్ధికి బాటలు వేశాయన్నారు. నియోజకవర్గంలో రూ.24.40 కోట్లతో 301 సీసీ రహదారుల నిర్మాణం, రూ.5 కోట్లతో 11 డ్రెయినేజీల నిర్మాణం, రూ.35 లక్షలతో ఆరు ప్రహరీల నిర్మాణానికి ఆమోదం లభించినట్టు తెలిపారు. నియోజకవర్గంలో 242 పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.3.63 లక్షల రాయితీగా అందించనున్నట్టు చెప్పారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం

గ్రామ సభల ద్వారా ఉద్యాన రంగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. హార్టికల్చర్ పంటల విస్తరణకు సంబంధించి 111.33 ఎకరాల్లో ప్లాంటేషన్ ప్రోత్సాహం అందించేందుకు రూ.15.75 లక్షలు, 16.2 కి.మీ పొడవున రహదారులు, పంటకాలువ గట్ల వెంట మొక్కలు నాటేందుకు రూ.20 లక్షలు, ఆయిల్ ఫాం పాండ్స్ తవ్వకం కోసం రూ.30 లక్షలు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. వీటితో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయనున్నట్టు బుద్ధప్రసాద్ వివరించారు.

సేవారత్న అవార్డుకు ఎమ్మెల్యే ఎంపిక

అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ చెన్నైకి చెందిన శ్రీకళా సుధ తెలుగు అసోసియేషన్ సేవారత్న అవార్డుకు ఎంపికైనట్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన చెన్నై రాయ్యపేటలో మ్యూజిక్ అకాడమీలో జరిగే శ్రీకృష్ణాష్టమి సిల్వర్ జూబ్లీ వాలిడెక్టరీ సెలబ్రేషన్స్ అవార్డ్స్ అందజేసే కార్యక్రమం జరుగుతుంది. వైద్య, రాజకీయ, నృత్య, సంగీత రంగాల్లో గుర్తింపు పొందిన వారికి ఈ అవార్డులు అందిస్తారు. రాజకీయ రంగంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని ఎంపిక చేసినట్టు ఆయన ప్రకటనలో తెలిపారు. ఎంపీ మాగుంట సుబ్బిరామిరెడ్డి, పీజీఎస్ హోమ్స్ క్రెడాయ్ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ పద్మ దేవరాజ్, ప్రముఖ గాయని పద్మభూషణ్ పి.సుశీల, ఆచార్య సీఎంకే రెడ్డి, సినీ నిర్మాత ఏఎం రత్నం, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని శ్రీనివాస్ తెలిపారు.

మహిళలు లక్షాధికారులు కావడమే లక్ష్యం



గూడూరులో సీఐఎఫ్ నిధుల చెక్కు అందజేస్తునన ఎంపీపీ సంగా మధుసూదనరావు

మోపిదేవి: భారత ప్రధాని నరేంద్ర మోడి ఆశయ సాధనలో భాగంగా ప్రతి మహిళా ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా మహిళా సభ్యులను తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి ఎంపీపీ నడకుదుటి జనసీ కుమారి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'లక్‌పతి దీదీస్' కార్యక్రమంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండలంలో మొదటి విడతగా ఎంపికైన 'లక్‌పతి దీదీస్, సీఆర్పీలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, మండల బుక్ కీపర్లు, గ్రామైక్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో

గూడూరు: ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. ఆదివారం గూడూరులోని వెలుగు కార్యాలయంలో 'లక్‌పతి దీదీ' కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యక్ష వీక్షణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే వారి కుటుంబం ఆర్థికంగా స్థిరపడతాయన్నారు. గూడూరు మండలంలోని 8 గ్రామైక్య సంఘాలకు సీఐఎఫ్ ద్వారా మంజూరైన రూ.8 లక్షల విలువైన చెక్కులను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.కల్యాణి, సీసీలు ఆరేపు శ్రీను, పి.సంతోష రేఖ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నాగాయలంకలో

నాగాయలంక: స్వయం సహాయక సంఘాల్లో అర్హులైన పేద మహిళల కోసం భారత ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన లక్‌పతి దీదీ కార్యక్రమం ప్రత్యక్షప్రసారాన్ని స్థానిక దివిసీమ మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం సభ్యులు వీక్షించారు. వెలుగు ఏపీఎం కె.వై.దాస్ అధ్యక్షతన ప్రధాని సందేశాన్ని వీక్షించారు. వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నైవేద్యాల సమర్పణ

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెంలో వేంచేసియున్న నూకాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, చీరె, జాకెట్, గారెలు, పులిహోరతో కూడిన నైవేద్యాలు సమర్పించుకున్నారు. గత ఐదు రోజులుగా ఇంటింటా ఊరేగింపుగా వెళ్లి భక్తులకు అమ్మవారి దీవెనలు అందించారు. అనంతరం చివరి రోజు ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

హుండీ చోరీపై ఫిర్యాదు



పెడన: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని గణపతి ఆలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు హుండీ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై ఆదివారం కమిటీ సభ్యులు పోలీసులకు సీసీ పుటేజీలు అందజేసి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణ నడిబొడ్డున గుడివాడ ప్రధాన రహదారి మార్జిన్‌లోని గణపతి ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లడంలో భక్తుల్లో ఆందోళన నెలకొంది. హుండీలో పెద్ద మొత్తంలోనే కానుకలు ఉంటాయని భక్తులు పేర్కొటున్నారు. ఇటీవల బస్టాండులో విద్యార్థుల సైకిళ్లు దొంగతనానికి గురయ్యాయి. వీటిపై నేటికీ ఎటువంటి చర్యలు లేదని తెలుస్తోంది.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

గూడూరు: గ్రామంలో ప్రబలుతున్న విషజ్వరాలను అదుపు చేయడానికి ఆకులమన్నాడు సర్పంచి మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. అంతర్గత వీధుల వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బందితో తొలగించే పనులు చేపట్టారు. మురుగు నిల్వ ప్రాంతాలను గుర్తించి బ్లీచింగ్, సున్నం చల్లారు. తాగునీటి బావులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహించారు. పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా సర్పంచ్ కోరారు.

బీసీల అభ్యున్నతికి కృషి చేసిన మండల్



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

మచిలీపట్నంటౌన్: బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 106వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీ వర్గాల కష్టసుఖాలను తెలుసుకునేందుకు మండల్ దేశమంతా పర్యటించి బీసీ జనగణన ప్రకారం విద్య, చట్ట సభలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను పొందుపరిచారని, 40 సిఫార్సులను పార్లమెంట్‌కు పంపారన్నారు. ప్రస్తుతం బీసీ యువత ఓబీసీ కోటాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేయటం మండల్ చేసిన కృషి ఫలితమేనన్నారు. బీసీల అభ్యున్నతి కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని ఆయన కొనియాడారు. కోమటి శ్రీను, జన్ను గోవింద్, భట్రాజు రాంబాబు, భోగిరెడ్డి దుర్గా, సుభాని, నిక్కు రాధాకృష్ణ, నీలపాల ఫణి, పడమటి కోటి తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించండి



బాసినపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ గణేష్‌కుమార్

బంటుమిల్లి: సోమవారం శ్రీ కృష్ణజన్మాష్టమి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అర్తమూరు పంచాయతీ శివారు బాసినపాడు గ్రామంలో ఆదివారం గ్రామస్తులతో ఎస్‌ఐ అవగాహన సమావేశం నిర్వహించారు. గత కొద్ది సంవత్సరాలుగా గ్రామంలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న గొడవల నేపథ్యంలో పండుగను అందరూ కలిసి జరుపుకోవాలంటూ ఎస్‌ఐ గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో వివాదాలకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ భాస్కరరావు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎవరో వస్తారని ఎదురు చూడకుండా!

సొంత ఖర్చుతో కాలువ పూడిక తీయించుకున్న రైతులు



పంట కాలువ పూడిక తీయించుకుంటున్న రైతులు

యండకుదురు(ఘంటసాల): ఎవరో వస్తారని..ఏదో చేస్తారని రైతులు ఎదురు చూడకుండా పంటకాలువను సొంత ఖర్చుతో బాగుచేయించుకున్నారు రైతులు. మండలంలోని యండకుదురు గ్రామంలో భీమనది ఛానల్ పరిధిలోని పంట కాలువ చివరి భూములకు సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోక పోవడంతో సొంత ఖర్చులతో పంట కాలువ పూడిక తీయించుకున్నారు. ఆ కాలువ పరిధిలో సుమారు 1200 నుంచి 1500 ఎకరాల సాగు ఉండగా సాగునీరు అందక 700 పైగా ఎకరాలు బీడుగానే ఉన్నాయి. చివరి భూములకు సాగునీరు వస్తాయనే ఆశతో ఒక్కో రైతు సుమారు రూ.2 వేల వరకు విరాళాలు వేసుకుని పొక్లయిన్ సాయంతో పంటకాలువ తవ్వకాలను చేపట్టారు.

రికార్డులు తీసుకెళ్లడంపై అభ్యంతరం

గూడూరు: మండలంలోని ముక్కొల్లు పంచాయతీ కార్యాలయం నుంచి రికార్డులు తీసుకెళ్తున్న పంచాయతీ కార్యదర్శి లోయ శివనాగేశ్వరరావును ఆదివారం స్థానికులు అడ్డుకున్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభలో కూటమి నాయకులు పంచాయతీలో జరిగిన పలు అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పంచాయతీ చెరువుల ఆదాయం తదితర అంశాలపై అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో రికార్డులు తారుమారు చేయడానికే ఆదివారం పంచాయతీ కార్యదర్శి రికార్డులు తన వెంట తీసుకెళ్తున్నారంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే తాను ముక్కొల్లుతో పాటు గంగ్రం గ్రామానికి కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నానని, గంగ్రం రికార్డులు అప్పగించడానికి తీసుకెళ్తున్నానని శివనాగేశ్వరరావు చెప్తున్నారు. అయితే ఆదివారం సెలవు రోజున రికార్డులు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎమిటంటూ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కూటమి నాయకులు చెబుతున్నారు.

కాలువలను కలుషితం చేయొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

అవనిగడ్డ: తాగునీటి అవసరాలకు ఉపయోగించే పంటకాలువల్లో వ్యర్థాలు వేయొద్దని ఎస్‌ఐ కె.శ్రీనివాస్ చెప్పారు. హోటల్స్ నిర్వాహకులు, మాసం దుకాణ దారులు, పంటకాలువ పక్కన ఉండే వారికి ఆదివారం ఎస్‌ఐ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివిసీమ ప్రజలు తాగునీటికి ఉపయోగించే పంటకాలువల్లో వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమవుతుందని చెప్పారు. ఆదేశాలను దిక్కరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

28న 'గోరువెచ్చని సూరీడు' గ్రంథావిష్కరణ

అవనిగడ్డ: పాత్రికేయుడు, కవి గొరుముచ్చు సూర్యనారాయణ రచించిన 'గోరువెచ్చని సూరీడు' గ్రంథావిష్కరణ ఈనెల 28న నిర్వహించనున్నట్టు ప్రముఖ కవి, దివిసీమ సాహితీ సమితి ప్రతినిధి గుడిసేవ విష్ణుప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివిసీమ సాహితీ సమితి, అవనిగడ్డ ప్రెస్‌క్లబ్, దివి జర్నలిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గాంధీక్షేత్రంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుంది. కవి డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ఆనంద్ మృతి



గూడూరు: గూడూరు పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ వేము ఆనంద్ (52) ఆదివారం మృతి చెందారు. చిట్టిగూడూరుకు చెందిన ఆనంద్ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడిగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో గూడూరు పీఏసీఎస్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆదివారం గూడూరులోని చర్చిలో ప్రార్థనలో ఉండగా గుండెపోటుకు గురయ్యారు. బందరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆనంద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆనంద్ మృతి పట్ల వైఎస్సార్ సీపీ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వైభవంగా పెన్నేరమ్మ వార్షిక సంబరం

ఘంటసాల: స్థానిక గ్రామ దేవత శ్రీ పెన్నేరమ్మ వారి 83వ వార్షిక సంబరం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అవనిగడ్డ చంద్రబాబు ఆధ్వర్యంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలయ ప్రాంగణంలో రంగుల ముగ్గుతో అమ్మ వారి చిత్రపటాన్ని వేశారు. భక్తులు తీసుకొచ్చిన నైవేద్యాలు, కుంభం సమర్పించారు. అమ్మ వారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీ పెన్నేరమ్మ అమ్మవారి దేవస్థానం ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.